www.aashwi.net / in

PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



యువ ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

6

ఆదివారం, 18-10-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :157 Issue :157 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



పల్లెకు ప్రయాణం

- దసరా పండుగతో సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- ఎంజీబీఎస్, జేబీఎస్‌లో భారీగా ప్రయాణికుల రద్దీ
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు
- శివారు ప్రాంతాల నుంచే సొంతూర్లకు వెళ్లే సదుపాయం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం

హైదరాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

దసరా పండుగ నేపథ్యంలో భాగ్యనగరం నుంచి పల్లెలకు జనప్రవాహం మొదలైంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో ఎటు చూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోవడంతో రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రెండు రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు

పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లే మార్గాల్లోనూ అదనపు సర్వీసులు

మిగతా 2వ పేజీలో..



గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు మద్దతు పలుకుతున్న రేవంత్
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- కావేరి ముసుగులో తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో పది మోటర్లు ఎందుకు నడపలేదు?
- నిప్పలు చెరిగిన హరీష్ రావు

3



మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- నవంబర్ చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల

మిగతా 2వ పేజీలో..



ఆడబిడ్డలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- ఆడబిడ్డలకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు
- తెలంగాణ వైభవానికి, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- సామాజిక న్యాయం, మహిళల ఐక్యతకు సంకేతం: భట్టి
- ఆడబిడ్డల సంక్షేమానికే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

3



ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

2

మహిళలతో వివాహేతర సంబంధాలు..

- ఆర్మీ మేజర్‌కు షోకాజ్ నోటీసులు
- సైనిక అధికారుల భార్యలతోనూ సంబంధాలున్నాయంటూ ఆరోపణలు
- సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ కోరిన ఆర్మీ చీఫ్
- కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలకు సిద్ధమైన సైన్యం

6

విద్యార్థులు, మహిళలపై పోలీసుల వేధింపులు

- దిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపులు జరిగాయని విమర్శ
- బాధ్యులపై చర్యలకు ఆధారాలు సేకరించాలని సూచన
- కేరళ, రాజస్థాన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు

6

న్యాయం కోసం ధైర్యంగా నిలబడండి: సీజేఐ సూర్యకాంత్

- రాజ్యాంగ విలువలు, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలి
- న్యాయవాదులు నిజాయతీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి
- న్యాయవిద్యార్థులకు దేశం ఆశాకిరణాలుగా చూడాలి

6



మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

- డీజీపీ ఆనంద్
- రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీ



హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టి, యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీజీపీ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన శనివారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా సీఆర్పీఎఫ్ నోడల్ ఏజెన్సీగా

మిగతా 2వ పేజీలో..

315 మండలాల్లో కరువు పరిస్థితులు

- కేంద్రం తక్షణ సహాయం అందించాలి
- సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- 'ఖేత్ బచావో అభియాన'పై వీసీలో పాల్గొన్న మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర వ్యవసాయ,

మిగతా 2వ పేజీలో..



ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

- మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి
- ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

2



తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా నీటి ఎద్దడి రానివ్వం
- పక్కాగా ముందస్తు కార్యాచరణ అమలు
- 23న సింగూరు రిజర్వాయర్‌పై ప్రత్యేక సమావేశం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

2

315 మండలాల్లో కరువు పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి

రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 22 నుండి నవంబరు 30 వరకు నిర్వహిస్తామని, అఖిల భారత వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని తమ ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనె గింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధరపై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (పీఎసఎస్) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. వీబీ జీ రామ్‌జీ ప□థకం కింద నిధుల కేటాయింపును పెంచడంతోపాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతోపాటు పండించిన పంటలకు మార్కెట్‌లో కొనుగోలు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు కార్యక్రమం సద్దుల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు బీఆరఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మదిరోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో రాష్ట్రవ్యాప్తంగా సందడి నెలకొన్నదన్నారు. 'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదని, వారి కృషిని, త్యాగాలను గుర్తించిన నాటి బీఆరఎస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఎలాంటి కష్టం కలగకుండా చూస్తూ వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే బతుకమ్మ పండుగ స్ఫూర్తిని కొనసాగించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనల మేరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని మహిళలందరికీ ఆమె ఆహ్వానం పలికారు. ఆడపడుచులందరికీ పేరుపేరునా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఒక పండుగేకాక తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, ప్రజల జీవన విధానాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంపదను చాటిచెప్పే అరుదైన సాంస్కృతిక వేడుక అని అన్నారు. పూలతో చెరువులను శుద్ధి చేసుకుంటూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సాధారణంగా పూలతో దేవుళ్లను పూజిస్తామని, కానీ పూలనే దేవతలుగా భావించి పూజించే ప్రత్యేకమైన సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుందని వివరించారు. నవధాన్యాలను ప్రసాదాలుగా పంచుకుంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో అంతర్భాగమన్నారు. ఆత్మీయత, అనురాగాలను కలబోసుకుని, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మహిళలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ అని సీతక్క తెలిపారు. ఈ వేడుక మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందిస్తున్నారని, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ప్రత్యేకతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెద్ద బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్‌లోని మహిళలందరూ తరలిరావాలని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆహ్వానించారు. మీ సీతక్కగా మీ అందరినీ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్నాను.. తెలంగాణ ఆడపడుచులందరికీ స్వాగతం.. సుస్వాగతం అని అన్నారు.



తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఎర్రమంజిల్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల వారీగా నీటి నిల్వలు, ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితులు,న వేసవిలో ఎదురయ్యే అవసరాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

తాగునీటికే మొదటి ప్రాధాన్యత

నవంబర్ 1 లోపు సాగునీటి అవసరాలు తీరిన అనంతరం రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా అత్యవసర పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పంపులను సమీకరించి కనీసం వంద పంపులను అందుబాటులో ఉంచాలని, పనిచేయని పంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.

గ్రామస్థాయి నుంచే వేసవి కార్యాచరణ

రానున్న యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిచ్చేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి వేసవి కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. రెండో వారంలో మండల స్థాయిలో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని హ్యాబిటేషన్‌ల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వినియోగానికి సిద్ధం చేయాలని చెప్పారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పనులను పూర్తి చేయాలని, అవసరమైనచోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పైప్‌లైన్ లీకేజీలపై నిర్లక్ష్యం వద్దు

అందుబాటులో ఉన్న నీటిని ప్రతి చుక్కా విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఇతర శాఖలు రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టే సమయంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల కారణంగా పైప్‌లైన్లు దెబ్బతింటే సంబంధిత శాఖలే బాధ్యత వహించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్లు దెబ్బతిన్న సందర్భాల్లో వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్ మరమ్మతులకు అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఇందుకోసం వీబీ జీ రామ్ జీ నిధులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

అత్యవసర నిధులతో తక్షణ చర్యలు

తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్న అత్యవసర నిధులతోపాటు ఎస్‌డీఎఫ్ నిధులను కూడా నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించేలా అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

సింగూరు ప్రభావిత జిల్లాలపై ప్రత్యేక సమీక్ష

సింగూరు రిజర్వాయర్ మినహా ఇతర రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌పై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలు, నీటి వనరుల సమర్థ వినియోగం, నిరంతర పర్యవేక్షణతో రానున్న వేసవిలోనూ ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, వివిధ స్థాయిల చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పల్లెకు ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

నడుపుతున్నారు. బస్టాండ్లలో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను పంపిస్తున్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా అవసరమైన సహాయం అందించడంతోపాటు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారు.



శివార్ల నుంచే సొంతూర్లకు..

నగరంలోని ప్రధాన బస్టాండ్ల వద్ద రద్దీ, ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. విజయవాడ, సూర్యాపేట, ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బెంగళూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ మార్గాల్లో వెళ్లేవారికి ఆరాంఘర్ నుంచి సర్వీసులు అందుబాటులో ఉంచింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లేవారి కోసం జేబీఎస్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో బస్సులు ఏర్పాటు చేసింది. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులు సొంతూళ్లకు వెళ్లేందుకు కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లు కల్పించింది. దీంతో నగరం నడిబొడ్డుకు చేరుకోకుండానే ప్రయాణికులు తమ ప్రాంతాలకు సమీపంలోని పాయింట్ల నుంచి బస్సులు ఎక్కే అవకాశం లభిస్తోంది.

మహిళలకు మహాలక్ష్మి అండ

పండుగ ప్రయాణాల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం ఉపశమనం కలిగిస్తోంది. నిబంధనల ప్రకారం అర్హులైన మహిళలు పథకం వర్తించే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రత్యేక సర్వీసుల్లోనూ అర్హతకు సంబంధించిన గుర్తింపు కార్డులు చూపించి జీరో టికెట్లు పొందేలా కండక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి ఊళ్లకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను తగ్గిస్తోంది. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచడంతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పట్నం నుంచి పల్లెల వైపు సాగుతున్న ఈ ప్రయాణాల నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.

మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

మొదటిపేజీ తరువాయి

సమన్వయంతో దేశవ్యాప్తంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారినపడి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి అన్నారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ సమన్వయంతో డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.దేశంలోని భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే అందరి లక్ష్యమని పేర్కొన్నారు. ఐక్యత, సామాజిక బాధ్యతను చాటిచెప్పడంతోపాటు డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఉద్దేశంగా మాదకద్రవ్యాలపై పోరాటం అనే ఇతివృత్తంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ మాదక ద్రవ్యాల రహిత భారత్, నషా ముక్త్ భారత్ సహకారానికి అందరం కలిసి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ వివరించారు. తెలంగాణ పోలీస్ సిబ్బంది కూడా రైడ్ లో పాల్గొన్నారు. రైడర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవాలని డీజీపీ సూచించారు. ర్యాలీలో పాల్గొంటున్న బైక్ రైడర్లు వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణించి అక్టోబరు 30 నాటికి గుజరాత్‌లోని కెవడియాకు చేరుకోనున్నారు. 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్కడ నిర్వహించే జాతీయ ఐక్యతా/రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య,హైదరాబాద్ సిపి సజ్జనార్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్, నార్కటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్ తో పాటుగా పోలీసు అధికారులు సిబ్బంది, ఎన్ సి సి విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

మొదటిపేజీ తరువాయి

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూ సర్వే పురోగతిపై సచివాలయంలో రెవెన్యూ అధికారులతో శనివారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయన్నారు. ప్రజల సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకుని మొత్తం 2,720 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుకు భూమి ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతోపాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీ సర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉప విభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందని అన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీ సర్వే చేపడుతున్నట్లు వివరించారు. గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతోపాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు.

త్వరలో పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ

రీ సర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతోపాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాల్లో వంద శాతం రీ సర్వేను విజయవంతంగా పూర్తిచేశామని, త్వరలో భూదార్ పట్టాలు పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ముందుగానే తెలియజేయడం ద్వారా భూ యజమానులు అందుబాటులో ఉండేలా తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీ సర్వేను అధికారులు ప్రభుత్వ విధిగా భావించకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి సూచించారు.

గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

నవంబర్ 3న దిల్లీలో జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ మీటింగ్ ఎజెండాలో గోదావరి కావేరి లింకును చేరుస్తూ రాష్ట్ర నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారు. అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నడని బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ భవన్లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గోదావరి కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని చంద్రబాబు ఈనెల 7న లేఖ రాయగానే ఎజెండాలో పొందుపరిచి నవంబర్ 3న మీటింగ్ పెట్టారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కుక్కిన పేనుల్లా పడి ఉన్న తెలంగాణ ద్రోహులంతా ఇవాళ మళ్ళా నిద్రలేచారు. పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టుతో గోదావరి జలాలను అక్రమంగా ఆంధ్రకు తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడిన మరుక్షణం నుంచే చంద్రబాబు గోదావరీ జలాల దోపిడీ మొదలు పెట్టిండని ఆరోపించారు. కోవర్టు రేవంతు తెలంగాణ నీటి హక్కులు నిండా ముంచుతున్నడు. గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు ఏపీ సీఎం చంద్ర బాబు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వ మొద్దు నిద్రలో ఉంటే ఆ ఎత్తులను బిఆర్ఎస్ చిత్తు చేస్తూ వస్తున్నది. గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు తొలుత పోలవరంబనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. ఆ తర్వాత నల్లమలసాగర్‌గా పేరు మార్చారు. ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి దానిని గోదావరికావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి కావేరి ముసుగులో మూడో ప్రతిపాదనకు తీసుకువచ్చారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేసిండు. గోదావరి బనకచర్ల, గోదావరి నల్లమల సాగర్ ఫెయిల్ కావడంతో మొత్తం తెలంగాణ నదీ జలాలను కబలించే కుట్ర ఇది. అడ్డుకోవాల్సిన రేవంత్ రెడ్డి పూర్తిగా దాసోహం అంటున్నడు. పోలవరం నుంచి కావేరికి నేరుగా కలిపి అనుసంధానంలో తెలంగాణ లేకుండా చేసారు. కేసీఆర్ హెచ్చరించినట్టు 'కత్తి పరాయి వాడిదే కానీ..పొడిచే చెయ్యి' మనోడిదే! 'చెయ్యి' తెలంగాణ నోట్లో మట్టికొడుతున్నది.

ఇది జాతి ద్రోహం

'గురుదక్షిణ అని నువ్వు అనుకుంటున్నవు, కానీ ఇది అంతకు మించిన జాతి ద్రోహం. నువ్వు చేస్తున్న జల ద్రోహానికి భవిష్యత్ తరాలు కూడా నిన్ను క్షమించవు రేవంత్ రెడ్డి' అన్నారు. బనకచర్ల విషయంలో మేం అనేకసార్లు హెచ్చరించినం.. చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలని చెప్పినం. మా గురువు మా గురువు అంటూ గోదావరి జలాలను వదలిపెట్టిండు. ఇప్పుడు అసలుకే ఎసరు వచ్చింది. ఈ రేవంత్ రెడ్డి.. ఇన్నాళ్లూ మనకు నీళ్లు ఉన్నా.. నీటి హక్కులు ఉన్నా వినియోగించలే దు. ఇప్పుడు ఏకంగా నీటి హక్కులే లేకుండా చేస్తున్నడు. ఇప్పటికే రిజర్వాయర్లలో నీటి నిల్వ లేదు, పంటలకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. ఎల్ నినో ఎఫెక్ట్ ఉంటుందని 9 నెలల నుంచి మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైన రేవంత్ రెడ్డి నేడు ఎల్ ని నో పేరు చెప్పి చేతులెత్తేసిండు. రైతులు, ప్రజలను మీ సావు మీరు సావండి అంటున్నడు. ఇంక 'ఏదైనా కొనగలం కానీ నీళ్లను కొనలేం అంటున్నడు'. మరి అంతటి ద్రోహా



న్యం గల నీళ్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నవు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. దేవాదులలో నీళ్లు వస్తున్నయి. పది మోటార్లు నడవాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నావు అని నిలదీసినం. తెలంగాణ భవన్ లో మాట్లాడినం, వరంగల్ జిల్లాలో మాట్లాడినం. ఈరోజు పైసలు పెట్టి ఏదైనా కొనొచ్చు, నీళ్లు కొనలేం అంటున్నడు. దేవాదులలో పదికి పది మోటార్లు ఎందుకు నడపలేదు? అది చేసుంటే ఈరోజు వరంగల్ లో కరువు వచ్చేది కాదు కదా అన్నారు. ఏపీలో కరువు లేదు. తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఏపీలో నమోదైంది. కానీ అక్కడ క్రాప్ హాలిడే లేదు, ఇక్కడ మాత్రం పంటలు వేయొద్దు అంటున్నవు. దేవాదులలో 10 మోటార్లు నడిపితే చెరువులు, చెక్ డ్యాంలు, రిజర్వాయర్లు నిండేవి కరువు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు నిల్వ ఉన్నా లిఫ్ట్ చేయలేదు. 5 మోటార్లు ఉన్న కల్వకుర్తిలో 3 మోటార్లు 7,8 గంటలు నడిపావు. నువ్వు వదిలిపెడితే చంద్రబాబు 700 కి.మీ దూరంలో ఉన్న కుప్పానికి నీళ్లు తీసుకువెళ్లాడు. ఏపీలో జలహారతి, తెలంగాణలో కన్నీళ్ల హారతి. పాలమూరుకు, తెలంగాణకు కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ తెచ్చిన కరువు. కన్నెపల్లిలో మోటార్లు నడపాలని డిమాండ్ చేస్తే నడపలేదు. ఎన్డీఏస్ఏ పేరు చెప్పి కాలయాపన చేసినవు అని హరీష్‌రావు ఆరోపించారు. నీళ్లు లిఫ్ట్ చేయడం రాష్ట్ర నిర్ణయం మాకు సంబంధం లేదు అని హైకోర్టులో ఎన్డీఎస్ఏ అఫిడవిట్ వేసి చెంప చెళ్లుమనేలా చెప్పింది. సిడబ్లుపిఆర్ఎస్ తన నివేదికలో అన్నారం, సుందిళ్ల అద్భుతంగా ఉన్నాయని చెప్పాయి. కన్నెపల్లిలో నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా, తెలంగాణకు, హైదరాబాద్ కు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా రాజకీయాలు చేస్తూ లేని కరువు తెచ్చినవు రేవంత్ రెడ్డి. దేవాదుల, కన్నెపల్లి, కల్వకుర్తిలో 24 గంటల పాటు ఎందుకు మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తలేదు. పంపుల వద్దకు అఖిలపక్షం తీసుకుపోదాం పదా? నీ ఫెయిల్యూర్ చూపిస్తా? ఎన్ని గంటలు నడిపినవు? ఎన్ని ఎత్తినవు తెలుస్తుంది అన్నారు. కల్వకుర్తిలో 35 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉంటే 13 టీఎంసీలు నడిపినవు. మిగిలిన నీళ్లు ఏపీకి దారాదత్తం చేసినవు. నేను రుజువు చేయడానికి రెడీగా ఉన్నా పోదాం పదా.

మన్ను తిన్న పాము లెక్క ఉన్నవ్

గోదావరి జలాలను తరలించుకుపోయే లింకు విషయంలో చంద్రబాబు లేఖల మీద లేఖలు రాస్తున్నడు. దిల్లీలో మీటింగులు అటెండ్ అవుతున్నడు. నువ్వు మన్ను తిన్న పాము లెక్క కదులవు మెదులవు. ఈనెల 7న చంద్రబాబు పాటిల్ కు లేఖ రాసిండు. ఆ లేఖ గోదావరిలో తెలంగాణ హక్కులకు మరణశాసనం. లేఖ మూడో పాయింట్: ''గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు నీటిని మళ్లించే వనరుగా ఇచ్చంపల్లి లేదా సమ్మక్క సాగర్ ను గతంలో ఎన్డబ్ల్యుడీఏ ప్రతిపాదించింది.. ఈ ప్రతిపాదన ప్రకారం నీటిని డైవర్ట్ చేస్తే, ఆంధ్రప్రదేశ్ కు తీవ్ర నష్టం. ఎలాంటి లాభం లేదు. పోలవరం, ఇతర ప్రాజెక్టుల నీటి వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుంద''ని లేఖలో రాసిండు.పదేళ్ల క్రితం జరిగిన నిర్ణయాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు.ఆనాడు బిఆర్ఎస్ ప్రతిపాదిస్తే ఇది సాధ్యం అయ్యింది.ఏ రాష్ట్రానికి ఎంత నీళ్లు అనేది ఆరోజు జరిగిన మీటింగ్ లో నిర్ణయించారు.గోదావరి పరివాహక ప్రాంతాలకు ఆ మెమరాండం కూడా పంపడం జరిగింది. తెలంగాణ నుంచి తీసుకుపోవాలని అన్ని రాష్ట్రాలు ఒప్పుకున్నయి.ఇచ్చంపల్లి నుంచి తీసుకుపోయేందుకు..

2024 జూన్ 10న జరిగిన మీటింగ్ లో మధ్య ప్రదేశ్, 2024 జూన్ 11న జరిగిన మీటింగ్ లో తమిళనాడు, 2026 సెప్టెంబర్ 3న కర్ణాటక, పుదుచ్చేరిలు ఒప్పుకున్నాయి. కానీ చంద్రబాబు మాత్రం తెలంగాణకు ప్రయోజనం వద్దు అంటున్నడు.లేఖలో ఆరో పాయింట్: గోదావరి నుంచి తరలించిన నీటిని నేరుగా నాగార్జున సాగర్ రిజర్వాయర్ లోకి వదలడానికి బదులుగా, బొల్లపల్లి రిజర్వాయర్ ను వినియోగించాలని అంటడు. 150 టీఎంసీలు నింపుకుంట అంటడు.మరి తెలంగాణ హక్కులు ఏం కావాలి.సమక్క నుంచి నాగార్జున సాగర్ మీదుగా తీసుకువెళ్తే తెలంగాణకు నీళ్లు వస్తయి, కరువు వస్తే మనం వాడుకోవచ్చు. మనకు నీటి హక్కులు ఉంటయి.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా నదుల అనుసంధానం జరగాలని కేంద్రం ఒప్పుకున్నది. సరిహద్దు రాష్ట్రాలు ఒప్పుకున్నయి.మేము ముందు నుంచి ఒకటే చెబుతున్నాం. ఇచ్చంపల్లి కావేరీ లింకు విషయంలో.మా రాష్ట్రానికి 968టీఎంసీలకు మాకు అనుమతి ఇవ్వాలి, తీసుకుపోయే నీళ్లలో 50శాతం మాకు ఇవ్వాలి, మా నీళ్లు ఒక్క చుక్క ముట్టుకోకుండా ముందుకు వెళ్తే నదుల అనుసంధానంకు ఒప్పుకుంటామని స్పష్టంగా చెప్పినం.ఇప్పుడేం జరుగుతున్నది అసలు ఇచ్చంపల్లి వద్దు, పోలవరం మార్చాలి అంటున్నరు. నాగార్జున సాగర్ మీదుగా వద్దు బొల్లపల్లి తీసుకుపోతం అంటున్నరు.మనకు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి? 139 టీఎంసీలు పెండింగ్ లో ఉన్నయి. వార్దా, సమ్మక్క, మూడో టీఎంసీలు కాంగ్రెస్ చేతగానితనం వల్ల వాపస్ చ్చింది.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా పోతే 2,38,236 ఎకరాలకు నీళ్లు అందుతాయి.ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు నీళ్లు వస్తయి. ఇది ఆనాటి కేంద్రం ఎంఓయూలో నే స్పష్టంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదన మార్చితే తెలంగాణ పరిశ్రమలకు నీళ్లు, తాగు నీరు, సాగు నీరు పరిస్థితి ఏమిటి?మొదట ఉండే రాష్ట్రం తెలంగాణ మన వాటా మనకు రాకుండా చేస్తున్నారు.చంద్ర బాబు లేఖ రాసి పది రోజులు అవుతున్నా నీకు సోయి రాదు పెదవి విప్పవు.అసలు ఇంటర్ లింకింగ్ నుంచి సమ్మక్క సాగర్ ను ఎందుకు తీసేస్తున్నరు.గతంలో సమ్మక్క సాగర్ కు 45 టీఎంసీ అనుమతి ఇవ్వొద్దు, మా పోలవరంకు నష్టం అవుతుంది అని ఏపీ లేఖ రాసింది. వాళ్లు వెంటనే డీపీఆర్ వాపస్ పంపారు.లేఖలో గోదావరి కావేరీ లింకు విన్ విన్ సిట్యుయేషన్ అంటున్న చంద్రబాబు గారు..ఏ విధంగా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుంది చంద్రబాబు చెబుతారా? రేవంత్ చెబుతారా? కేంద్రం చెబుతుందా ?తెలంగాణకు నష్టం చేసే ఈ ప్రతిపాదన ఎలా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుందని ప్రశ్నించారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మొన్న ఏపీకి వచ్చిండు.చేయి చేయి కలుపుదాం దక్షిణాదికి మేలు చేసుకుందాం అని మాట్లాడుకున్నరు.అసలు ఏం జరుగుతుందో తెలుసా రేవంత్ రెడ్డి.కర్ణాటకను ఒప్పించేందుకు చంద్రబాబు ఆఫర్ ఇచ్చిండు. మేము కింద గోదావరి నీళ్లు వాడుకుంటం, పైన ఆల్మట్టిలో 16 టీఎంసీలు ఆపుకో.కానీ పోలవరం లింకుకు ఒప్పుకో అంటున్నడు. అలైడీ పోలవరం డైవర్షన్ లో 21 టీఎంసీలు, ఇప్పుడు 16 టీఎంసీలు అంటే 37 టీఎంసీలు కృష్ణాలో ఆగితే పాలమూరు జిల్లాకు నష్టం. ఎల్ నినో నేపథ్యంలో నీళ్ల ప్రాధాన్యం అర్థమైన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎందుకు నోరు మెదపడం లేదు? తెలంగాణ శాశ్వతంరాష్ట్ర హక్కులను కాలరాసే హక్కు నీకు లేదు రేవంత్ రెడ్డి.జాతీయ ప్రయోజనాలు అంటే ఒక రాష్ట్రానికి మేలు జరగటం కాదు. ఇచ్చంపల్లి నుంచి లింకు ప్రాజెక్టు వెళ్తే అన్ని రాష్ట్రాలకు ఉపయోగం.కానీ కేంద్రం ఏం చేస్తున్నది. చంద్రబాబు ఏం చెబితే అదే చేస్తారా 16 మంది ఎంపీలు ఉండి గడ్డి పీకుతున్నారా.ఈ ప్రతిపాదన కేంద్రం ఒప్పుకుంటే తెలంగాణ జాతికిశాశ్వతంగా ద్రోహం చేసినట్లేరేవంత్ రెడ్డి ఎందుకు మౌనం? మీ మధ్య ఉన్న ఒప్పందం ఏమిటి.రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తుంటే, బిజేపీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత లేదా? కేఏల్ రావు గొప్పవారు అని ఏపీ వాళ్లు కీర్తిస్తారు. ఆ కేఏల్ రావే గోదావరి కావేరి లింకు ఇచ్చంపల్లి మీదుగా తీసుకుపోవాలని చెప్పారు. వారు చెప్పినా వినరా? ఏపీ ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు అవుతాయా?చంద్రబాబు ఎంపీలను చేతిలో పెట్టుకొని ఆడిస్తే కేంద్రం ఆడుతుందా? తెలంగాణ జాతికి మోసం చేస్తాం అంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరు. ఊరుకునే గడ్డ కాదు, ఎలాంటి పోరాటానికైనా సిద్ధం. ఈ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేస్తున్నాం.

సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు

సర్ ప్లస్ వాటర్ ఉందంటున్న చంద్రబాబు అసలు సర్ ప్లస్ వాటర్ ఎంతుంది, తెలంగాణ వాటా ఎంత అది తేలకుండా వాడుకుంటాం అంటే ఏమన్నట్లు? తెలంగాణ పరిస్థితి ఏమిటి? సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు. అసలు గోదావరి కావేరి నీళ్లు ఎక్కడివి అంటే.. చత్తీస్ గడ్ వినియోగించని 148 టీఎంసీలు. వీటిని గోదావరి కావేరీ లింకుకు వాడుతం అన్నరు.ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీలను మళ్లించాలనే లక్ష్యంతో ఎన్డబ్ల్యుడీఏ గోదావరి కావేరి లింకు ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.ఈ మళ్లించే 148 టీఎంసీల జలాల్లో తెలంగాణకు 43, ఏపీకి 44, తమిళనాడుకు 42.5, పుదుచ్చేరికి 2.5, కర్ణాటకకి 16 టీఎంసీలను పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నీళ్లన్నీ నువ్వే తీసుకుపోతే తెలంగాణ ఏం కావాలి. నేషనల్ ప్రాజెక్టు అంటున్నరు. మాకు నష్టం చేసేది నేషనల్ ప్రాజెక్టు ఎలా అవుతుంది? కాళేశ్వరం, పాలమూరు నేషనల్ ప్రాజెక్టు అడిగితే మాకు ఇవ్వలేదు.తెలంగాణకు ఒక్క నేషనల్ ప్రాజెక్టు వద్దా? కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కోవాలి. రేవంత్ నోరు విప్పాలి. నిజమైన కాంగ్రెస్ నాయకులారా.. తెలంగాణ గడ్డకు పచ్చ కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఇప్పటికైనా అడ్డుకోండి.ఇకనైనా బాబుకు చేసే బానిసత్వం మానుకోవాలనీ, తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.లేదంటే కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్ళతో పెకలిస్తాం, బిజేపీకి బుద్ధి చెబుతాం అని హెచ్చరిస్తున్నాం. సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అనిరు. తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలపాటు నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతోపాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్రమంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతున్నదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక ప్రజలకు, ఆడబిడ్డలకు ఉప ముఖ్యమంత్రి భట్టి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రకాల పూలు, రంగులు, సువాసనలు కలిసి అందమైన బతుకమ్మగా రూపుదిద్దుకున్నట్లే భిన్న వర్గాలు, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను ఈ పండుగ ఒక్కతాటిపైకి తీసుకువస్తుందని వివరించారు. సమాజంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ ఐకమత్యాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే విశిష్టమైన సంస్కృతికి తెలంగాణ నెలవని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమవుతూ మహిళలు సంప్రదాయ బద్ధంగా బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని, మహిళల ఆత్మగౌరవాన్ని, ప్రకృతిపై వారికున్న ఆరాధనా భావాన్ని ప్రతిబింబిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాల పూలవానకురిపించాలని,ప్రతికుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం తరతరాలపాటు కొనసాగాలని, బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు,సామాజిక సామరస్యానికి మరింత బలాన్నివ్వాలని అభిలషించారు.



న్యాయ, పోలీస్ శాఖల మధ్య సమన్వయం ముఖ్యం

- **గద్వాల జిల్లా కోర్టులో కోఆర్డినేషన్ సమావేశం**

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

జోగులాంబ గద్వాల జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో శనివారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కే. కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, డీఎల్ఎస్ఏ మెజిస్ట్రేట్, అదనపు ఎస్పీ కే. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా న్యాయ, పోలీస్ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించే అంశాలపై చర్చించారు. వివిధ శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.

ఎంవీఎస్ఆర్ కళాశాలలో విషాదం.. ఇద్దరు విద్యార్థులు మృతి

- **దండియా వేడుకల్లో కూలిన లైటింగ్ స్తంభాలు**
- **పలువురికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం**

నాదర్‌గుల్ (ఆశ్వి అప్డేట్స్):

నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దండియా వేడుకలు జరుగుతుండగా విషాదం చోటుచేసుకుంది. కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ స్తంభాలు అకస్మాత్తుగా కూలిపోవడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, పలువురు గాయపడినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. మృతుల్లో ఒకరిని వనపర్తికి చెందిన సోనీగా గుర్తించినట్లు సమాచారం. ఆమె సోదరి పరిస్థితి విషమంగా ఉండటంతో మరో ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. మరో ఐదుగురు విద్యార్థుల పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. విద్యార్థులు దండియా వేడుకల్లో పాల్గొంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే





కళాశాల సిబ్బంది, ఇతరులు స్పందించి గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, మృతులు, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుద్యోగులను నిండా ముంచిన ప్రభుత్వం

- **25వేల పోలీసు ఉద్యోగాలు ఖాలీ**
- **కేవలం 7వేల పోస్టుల భర్తీకే నోటిఫికేషన్**
- **ఆరకొర పోస్టుల భర్తీ నోటిఫికేషన్తో ఏం ప్రయోజనం**
- **బీఆర్ఎస్ నేత హరీష్‌రావు విమర్శ**

హైదరాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:



కాంగ్రెస్ ప్రభుత్వం తమను నిలువునా ముంచిందని, తమ ఆశలపై నీళ్లు చల్లిందని పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనీసం చలనం లేక పోవడం సిగ్గుచేటని హరీశ్రావు విమర్శించారు. హైదరాబాద్ లోని తన నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందించిన పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగులనుంచి వినతిపత్రం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగాల జాతర అంటూ నిరుద్యోగుల్లో ఆశలు రేపి ఓట్లు వేయించుకుని ఇప్పుడు నామమాత్రంగా పోస్టులు ప్రకటించడం అంటే యువతకు ద్రోహం చేయడమేనన్నారు. కేవలం ఏడు వేల పోస్టులతో కూడిన నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షలాదిమంది ఉద్యోగ అభ్యర్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారు? జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చేశారు. అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్నారు.తాజా కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు ఒక్కటి కూడా కేటాయించలేదు.చార్మినార్ జోన్ పరిధిలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు తగిన సంఖ్యలో లేకపోవడం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.పెరుగుతున్న నగర జనాభా, విస్తరిస్తున్న ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణకు అదనపు పోలీసు బలగాలు అత్యవసరం. అయినా ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని విస్మరించి నిరుద్యోగులను మోసం చేసింద అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆకాంక్షలను ఏమాత్రం నెరవేర్చలేదు అన్నది సుస్పష్టం. హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల అవేదన అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో వేలాది మంది యువత తమ సమయాన్ని, శ్రమను, ఆర్థిక వనరులను వెచ్చిస్తున్నారు. వారి ఆశలను, ఆకాంక్షలను గౌరవించండి.పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఫ్యూచర్ సిటీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ కేసు

- **రూ.2.28 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అంచనా.. ఐదు చోట్ల సోదాలు**

ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్ | అక్టోబర్ 17



మెడ్చల్-మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. శనివారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారు ఆభరణాలు, కారు, గృహోపకరణాలు, పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు గుర్తించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.2.28 కోట్లుగా అధికారులు పేర్కొన్నారు. మరికొన్ని ఆస్తులపై విచారణ కొనసాగుతోంది.

గత సెప్టెంబర్‌లో ఇదే ఇన్‌స్పెక్టర్ రూ.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడినట్లు ఏసీబీ వెల్లడించింది. ఆ కేసులో ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు. తాజా కేసులో పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

కేసుల దర్యాప్తులో లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి

- **గ్రేవ్ అక్విటల్ కేసులపై సమీక్షించిన అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | అక్టోబర్ 17



వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ అధ్యక్షతన శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (DPRC) సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో నమోదైన గ్రేవ్ అక్విటల్ కేసులపై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల కావడానికి గల కారణాలు, దర్యాప్తులో జరిగిన లోపాలు, సాక్ష్యాధారాల సమర్పణ, సాక్షుల హాజరు తదితర అంశాలను కేసుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ అధికారులకు సూచించారు.

దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు (CDOs), సెషన్స్ కోర్టు లైజన్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సాక్ష్యాధారాల సేకరణ, కేసు రికార్డుల నిర్వహణ, సాక్షుల హాజరు, చార్జ్‌షీట్ల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో లీగల్ అడ్వైజర్ అనిల్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెహ్రాజ్ పిర్దోష్, డీఎస్పీలు బి. జనయ్య, ఎన్. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాసులు, నర్సింగ్ యాదయ్య, అంజయ్య, పలువురు సీఐలు, సంబంధిత ఎస్‌డీపీఓలు, సెషన్స్ కోర్టు లైజన్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **మహిళల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ: ఎస్పీ శరత్ చంద్ర పవార్**

ఆశ్వి అప్డేట్స్ | నల్లగొండ | అక్టోబర్ 17



నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆయన సతీమణి పూజా పవార్, మహిళా పోలీస్ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పోలీసుల విధుల్లోకుటుంబ సభ్యుల సహకారం ఎంతో విలువైనదని పేర్కొంటూ, జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, మహిళా ఎస్‌ఐలు శ్రావణి, అమ్రీన్, మమత, సీఐ నాగరాజు, ఆర్‌ఐలు సంతోష్, సూరపు నాయుడు, కళ్యాణ్ రాజ్, మహిళా సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా బైక్ ర్యాలీ

- **యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలపై ఉక్కుపాదం: డీజీపీ సీవీ ఆనంద్**
- **రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన డీజీపీ**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడంతోపాటు యువత భవిష్యత్తును కాపాడే లక్ష్యంతో దేశవ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాల్లో భాగంగా, సీఆర్‌పీఎఫ్ నోడల్ ఏజెన్సీగా ఈ ర్యాలీని సమన్వయం చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ బారినపడుతూ యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే దేశ ప్రజలందరి లక్ష్యమని డీజీపీ పేర్కొన్నారు. జాతీయ ఐక్యతను చాటిచెప్పడంతోపాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన కోసం మాదకద్రవ్యాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీలో పాల్గొనే రైడర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీజీపీ సూచించారు. వివిధ ప్రాంతాల మీదుగా సాగే ఈ ర్యాలీ అక్టోబర్ 30 నాటికి గుజరాత్‌లోని కెవడియాకు చేరుకోనుంది. అక్టోబర్ 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్కడ నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమంలో రైడర్లు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహేశ్వరం టౌన్‌లో మణప్పురం గోల్డ్ లోన్ నూతన శాఖ ప్రారంభం

- **ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

మహేశ్వరం, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):



మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మణప్పురం గోల్డ్ లోన్ శాఖను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె నూతన శాఖ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ శాఖ ద్వారా స్థానిక ప్రజలకు గోల్డ్ లోన్ సేవలు మరింత చేరువ కానున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దసరా వేడుకలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు

- **407 దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక బందోబస్తు: వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా**

ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | అక్టోబర్ 17

దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ వేడుకలు, రావణ దహనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 407 దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించిన నేపథ్యంలో నిమజ్జన మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి, చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

రావణ దహన కార్యక్రమాల వద్ద జనసమూహాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భూ వివాదంతో వ్యాపారి కిడ్నాప్.. 10 మంది అరెస్ట్

- **రూ.15 కోట్లు డిమాండ్ చేసిన నిందితులు**
- **రూ.1.7 కోట్ల విలువైన సొత్తు రికవరీ.. మూడు కార్లు సీజ్**

హైదరాబాద్ (ఆశ్వి అప్డేట్స్):

బోడుప్పల్‌లో భూ వివాదం నేపథ్యంలో ఓ జ్యువెలరీ వ్యాపారిని కిడ్నాప్ చేసి రూ.15 కోట్లు డిమాండ్ చేసిన కేసును టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌తో పాటు మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సికింద్రాబాద్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.7 కోట్ల విలువైన సొత్తును రికవరీ చేయడంతో పాటు మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డీసీపీ వివరాల ప్రకారం.. అక్టోబర్ 5న చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీనివాస్ కనిపించడం లేదంటూ మిస్సింగ్ కేసు నమోదైంది. రామంతాపూర్‌లో జ్యువెలరీ షాప్ నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఉదయం దుకాణానికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి అదృశ్యమయ్యాడు. అదే రోజు ఉదయం సుమారు 10:30 గంటలకు డబ్బులు ఇవ్వాలంటూ బెదిరింపు కాల్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అక్టోబర్ 6న నగదు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అయితే, నగదు వ్యవహారంపై నిందితులకు అనుమానం రావడంతో షాద్‌నగర్ సమీపంలో రూ.1.30 లక్షలు తీసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. అనంతరం శ్రీనివాస్‌ను విడిచిపెట్టినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. బొంగుళూరు గేటు వద్ద మొదట ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, తదుపరి దర్యాప్తులో మొత్తం 10 మంది నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వివరించారు.



ప్రధాన నిందితుడిపై గతంలోనూ కేసులు

ఈ కేసులో శ్రీకాంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతనిపై గతంలో 16 చీటింగ్ కేసులు నమోదైనట్లు, జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. మరో నిందితుడు సురేష్‌పై పలు దొంగతనం కేసులు ఉన్నాయని, మూడో నిందితుడు శాంసన్ ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు డీసీపీ పేర్కొన్నారు.

శ్రీకాంత్, శ్రీనివాస్‌ల మధ్య బోడుప్పల్‌లో భూ వివాదం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ వివాదమే కిడ్నాప్ ఘటనకు కారణమా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. నిందితుల నుంచి రూ.1.7 కోట్ల విలువైన సొత్తును రికవరీ చేసి, మూడు కార్లను సీజ్ చేసినట్లు డీసీపీ రక్షిత కృష్ణమూర్తి వెల్లడించారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

దుర్గామాతను దర్శించుకున్న గజ్వేల్ సీఐ రవికుమార్

- **అహ్మదీపూర్‌లో బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం**

గజ్వేల్, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ సీఐ రవికుమార్ హాజరై దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించడం మానసిక ప్రశాంతతను, ఉల్లాసాన్ని కలిగిస్తుందని అన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీజేఆర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




అమర పోలీసుల స్ఫూర్తితో 157 మంది రక్తదానం


- **గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మూడు వారాల పాటు జంగిల్ ఆపరేషన్స్, సర్వైవల్ టాక్టిక్స్‌లో శిక్షణ పొందుతున్న 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సైతం రక్తదానం చేశారు. ప్రజాసేవతో పాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్‌కుమార్ (ఐపీఎస్) కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎం.డి. అష్ఫాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి. శంకరయ్య, జి. రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.హెచ్. రఘునందన్‌రావు, వైద్యాధికారులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.









ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలి**
- **అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు**

రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులతో ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ఏఈఆర్ఓలు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని, 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, అనర్హుల వివరాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తుల పరిష్కారం, నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల మేరకు చేపడుతున్నట్లు వివరించారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్రగుప్తా తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు డాకోళ్ల ఆంజనేయులు గౌడ్**

దౌల్తాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

మండల ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు డాకోళ్ల ఆంజనేయులు గౌడ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఆడపడుచులందరూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి నిలుస్తుందని తెలిపారు. పండుగలు ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపాలని, గ్రామాల్లో సోదరభావం, ఐకమత్యం పెంపొందాలని ఆకాంక్షించారు. మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.





ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

- **ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు గంప రవి గుప్తా**

దౌల్తాబాద్, అక్టోబర్ 17:



మండల ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గంప రవి గుప్తా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆడపడుచులందరూ బతుకమ్మ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గంప రవి గుప్తా కోరుకున్నారు.

పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

- **గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికలు.. పోటీ పరీక్షల విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు**

ఆశ్వి అప్డేట్స్, మేడ్చల్:

జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసి పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సి. వసుంధర తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, ప్రతిపాదనలను ఆమోదించారు. జిల్లాలో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం, ఇప్పటికే ఉన్న భవనాల ఆధునీకరణతో పాటు పాఠకులకు అవసరమైన తాగునీరు, ఫర్నిచర్, పుస్తకాల ర్యాకులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన పుస్తకాలు, పఠన సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విజ్ఞానాభివృద్ధికి, పోటీ పరీక్షల్లో విజయ సాధనకు తోడ్పడే కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సభ్యులు పాల్గొని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.





జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

జహీరాబాద్, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, చైర్మన్ యూనుస్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.





మండల ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

- **గొడుగుపల్లి సర్పంచ్ మద్దెల వనజ స్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి**

దౌల్తాబాద్, అక్టోబర్ 17:

మండల ప్రజలందరూ బతుకమ్మ, దసరా పండుగలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని గొడుగుపల్లి సర్పంచ్ మద్దెల వనజ స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని, చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యత, ప్రేమాభిమానాలను పెంపొందిస్తాయని తెలిపారు. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రైతులు, కూలీలు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.



మహిళా సంఘాల వేరుశనగ పంపిణీలో వివాదం

- **పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ మహిళల ఆందోళన.. విచారణకు హామీ ఇచ్చిన డీఆర్డీఓ**

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామంలో మహిళా సంఘాలకు కేటాయించిన వేరుశనగ విత్తనాల పంపిణీ వివాదానికి దారితీసింది. అర్హులైన మహిళా సంఘాలకు కాకుండా అనర్హులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నారంటూ మహిళలు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. అధికారుల సహకారంతో కొందరు కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి వర్గీయులు వేరుశనగ సంచులను తమకు అనుకూలమైన వారికి తరలించి కోళ్ల ఫారంలో నిల్వ చేశారని మహిళలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వనపర్తి నుంచి గణపురం వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షురాలి ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న డీఆర్డీఓ అధికారి ఘటనాస్థలికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. వేరుశనగ విత్తనాల పంపిణీపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. విత్తనాల పంపిణీపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

బతుకమ్మ, దసరా పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

- **దౌల్తాబాద్ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్**

దౌల్తాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:



మండల ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పండుగలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుతూ పరస్పర స్నేహభావంతో మెలగాలని కోరారు. మండల ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ ఆకాంక్షించారు.

బతుకమ్మ, దసరా పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- **ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్**

దౌల్తాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:



మండల ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండల ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. పండుగలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను, ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈ పండుగల సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పబ్బ మాధవి అశోక్ ఆకాంక్షించారు.



కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

- **మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో కండువాలు కప్పి ఆహ్వానం**

దౌల్తాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

దౌల్తాబాద్ మండలం ముబారస్పూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో కోటి సత్తయ్య, కోటి నరసింహ, కోటి నరసయ్య, ఈదుగాని చంద్రం, ఈదుగాని సౌందర్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాకోళ్ల ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి హిరగౌని శ్రీనివాస్ గౌడ్, ముబారస్పూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్షపతి, షాదుల్లా, వెంకటాచారి, కొంగర్ రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవి అవతారంలో దుర్గమ్మ దర్శనం

- **భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు.. అన్నప్రసాద వితరణ**

దౌల్తాబాద్, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ దుర్గా భవాని దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారిని మహాలక్ష్మి దేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుటుంబాల సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.



విద్యార్థులు, మహిళలపై పోలీసుల వేధింపులు: రాహుల్ గాంధీ

- దిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపులు జరిగాయని విమర్శ
- బాధ్యులపై చర్యలకు ఆధారాలు సేకరించాలని సూచన
- కేరళ, రాజస్థాన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు




న్యూఢిల్లీ, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

ప్రజాస్వామ్యం కోసం నిరసన తెలిపిన విద్యార్థులు, మహిళలపై దిల్లీ పోలీసులు దాడులు చేయడంతోపాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల గొంతుకను అణచివేసి, ప్రశ్నించేవారిని భయపెట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారాన్ని కోల్పోతామనే భయంతోనే యువత, మహిళలపై హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఇటీవలి నిరసనల్లో పోలీసుల వేధింపులకు గురయ్యామని ఆరోపించిన మహిళలతో రాహుల్ మాట్లాడిన వీడియోను కూడా పంచుకున్నారు. తమపై జరిగిన దాడులు, వేధింపులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరగా, ఫొటోలు, వీడియోలు వంటి ఆధారాలను అందించాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దాడుల అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. బాధితుల ఫిర్యాదులను దిల్లీ పోలీసులు స్వీకరించలేదని ఆరోపిస్తూ, కేరళ, రాజస్థాన్‌లలో దిల్లీ పోలీసులపై జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించినట్లు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

న్యాయం కోసం ధైర్యంగా నిలబడండి: సీజేఐ సూర్యకాంత్

- రాజ్యాంగ విలువలు, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలి
- న్యాయవాదులు నిజాయతీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి
- న్యాయవిద్యార్థులకు దేశం ఆశాకిరణాలుగా చూడాలి



బెంగళూరు, ఆశ్వి అప్డేట్స్:

న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడుతూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని సూచించారు. శనివారం బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. న్యాయవిద్య అంటే చట్టాలను నేర్చుకోవడమే కాదని, విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకుంటూ సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని పేర్కొన్నారు. వృత్తిలో సౌలభ్యం కోసం సూత్రాలను పక్కన పెట్టకూడదని, అన్యాయానికి గురైన వారికి అండగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. న్యాయవాదులు తమ వృత్తి బాధ్యతలతోపాటు దేశానికి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎల్ఎల్‌బీ పట్టా అందుకోకముందే మరణించిన ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సంతాపం తెలిపారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, అధ్యాపకుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. న్యాయవాదులుగానే కాకుండా ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు.

పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్‌పై సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు

- పేవాల్ వెనుక ఉన్నా నిషేధిత కంటెంట్‌ను అనుమతించొద్దు
- ఉల్లంఘనలకు భారీ జరిమానాలు, అక్రమ ఆదాయం స్వాధీనం చేసుకునేలా చర్యలు
- హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపునకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు
- పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం పరిష్కారం కాదన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సోషల్ మీడియా సంస్థలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పేవాల్ లేదా సబ్‌స్క్రిప్షన్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి కంటెంట్‌ను అందించడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడాన్ని అడ్డుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 15న ఈ ఆదేశాలు జారీ చేసింది. 2024లో ఇచ్చిన ఆదేశాల అమలులో తగిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది.

*** భారీ జరిమానాలకు ప్రతిపాదనలు**

సమాచార సాంకేతిక చట్ట నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా మధ్యవర్తులపై భారీ జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఉల్లంఘన తీవ్రత, వ్యవధి, పునరావృతం, సంస్థ వార్షిక టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. నిషేధిత కంటెంట్ ద్వారా సంపాదించిన ఆదాయాన్ని స్వాధీనం చేసుకునే విధానాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించింది.

ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు

పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు పర్‌సెప్చువల్ హాష్ మ్యాచింగ్, యూఆర్ఎల్ జాబితాల వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించాలని ధర్మాసనం సూచించింది. ఈ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకునేందుకు జాతీయ స్థాయి హాష్, యూఆర్ఎల్ డేటాబేస్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 15, ఐటీ చట్టంలోని సెక్షన్ 67బీ వంటి నిబంధనలను తప్పించుకునేలా ప్లాట్‌ఫామ్‌లు వ్యవహరించకూడదని స్పష్టం చేసింది.

మహిళలతో వివాహేతర సంబంధాలు..

- ఆర్మీ మేజర్‌కు షోకాజ్ నోటీసులు
- సైనిక అధికారుల భార్యలతోనూ సంబంధాలున్నాయంటూ ఆరోపణలు
- సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ కోరిన ఆర్మీ చీఫ్
- కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలకు సిద్ధమైన సైన్యం
- చర్యలను నిలిపివేయాలన్న మేజర్ అభ్యర్థనను తిరస్కరించిన ట్రిబ్యునల్



న్యూఢిల్లీ, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

నలుగురు మహిళలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్మీ మేజర్‌పై భారత సైన్యం చర్యలకు సిద్ధమైంది. ఆయనను సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఆర్మీ చీఫ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 11 ఆర్మర్డ్ రెజిమెంట్‌కు చెందిన ఈ అధికారి ప్రస్తుతం 23 గ్రెనేడియర్స్‌కు అనుబంధంగా ఉన్నట్లు సంబంధిత పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్ట్ మార్షల్ ద్వారా విచారణ చేపట్టడానికి బదులుగా ఆర్మీ రూల్స్ 14, 19 కింద పరిపాలనా చర్యలు ఎందుకు తీసుకోకూడదో అధికారులు వివరణ కోరారు.

భార్య ఫిర్యాదుతో మొదలైన విచారణ

మేజర్ భార్య 2023 ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్మీ ప్రధాన కార్యాలయ డిసిప్లిన్ అండ్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు సాయుధ దళాల ట్రిబ్యునల్ (ఏఎఫ్‌టీ)లో దాఖలైన పిటిషన్ వెల్లడించింది. వివాహేతర సంబంధాలతోపాటు డ్రగ్స్ వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నట్లు తెలిపింది. ఈ ఫిర్యాదుపై 2023 అక్టోబర్‌లో 55 (I) మెకనైజ్డ్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేసింది.

అయితే, విచారణలో ఆర్మీ రూల్ 180 ప్రకారం పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించారని మేజర్ ఆరోపించారు. ఫిర్యాదులో ప్రస్తావించిన మహిళలు, వారి భర్తలను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకోవడంతోపాటు నివాసంలో నిర్వహించిన సోదాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు


2025 మార్చిలో ఆర్మీ చట్టంలోని 45, 63 సెక్షన్ల కింద ప్రాథమిక అభియోగ పత్రాన్ని రూపొందించి, సాక్ష్యాల నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళలను కూడా విచారించాలని మేజర్ కోరినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు చేపట్టాలని సైన్యం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన ఏఎఫ్‌టీని ఆశ్రయించారు.

తన భార్య ఫిర్యాదును ఉపసంహరించుకున్నందున, గత విచారణ ఆధారంగా తీసుకుంటున్న చర్యలు చట్టవిరుద్ధమని మేజర్ వాదించారు. 2026లో తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని, రాజీ ఒప్పందంలో భాగంగా భార్య ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారని పిటిషన్‌లో వివరించారు. తగిన ఆధారాలు లేకుండానే కుటుంబ వివాదాల నేపథ్యంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారని మేజర్ తెలిపారు.

అయితే, అక్టోబర్ 14న పిటిషన్‌ను విచారించిన ఏఎఫ్‌టీ ప్రిన్సిపల్ బెంచ్.. మేజర్‌పై కొనసాగుతున్న పరిపాలనా చర్యలను నిలిపివేసేందుకు నిరాకరించింది. దీంతో ఆయనపై సైన్యం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఓవైసీని చూసి నేర్చుకోండి.. విపక్షాలకు కిరెన్ రిజిజు హితవు

- జాతీయ ప్రయోజనాల విషయంలో ఓవైసీ వైఖరిపై కేంద్రమంత్రి ప్రశంసలు
- భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైందంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్య
- మోదీపై ఎలాన్ మస్క్ విమర్శలను తప్పబట్టిన ఎంఐఎం అధినేత





న్యూఢిల్లీ, అక్టోబర్ 17, ఆశ్వి అప్డేట్స్:

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ప్రశంసలు కురిపించారు. ముస్లిం కేంద్రంగా సాగే రాజకీయ విధానాలను ఓవైసీ అనుసరిస్తున్నప్పటికీ, దేశ జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన హేతుబద్ధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలు ఆయన వైఖరి నుంచి నేర్చుకోవాలని సూచించారు. 'భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైంది' అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రిజిజు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

ఎలాన్ మస్క్ వ్యాఖ్యలతో వివాదం

ఇటీవల భారత్‌లో స్టార్‌లింక్ అనుమతుల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేసినట్లు కథనం పేర్కొంది. భారతదేశానికి నిజమైన ప్రధాని ముఖేశ్ అంబానీ అంటూ ఆయన ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'ఎలాన్.. భారతదేశానికి స్వాగతం. ఆ రెండో వ్యక్తి గురించి తెలిసే వరకు ఆగు' అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ ఈ వ్యాఖ్యల ద్వారా పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని పరోక్షంగా ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.

విదేశీ వ్యాపారవేత్తల

జోక్యంపై ఓవైసీ అభ్యంతరం

మస్క్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విధానాలను వ్యతిరేకించడం వేరు, భారతదేశ అంతర్గత వ్యవహారాలు, నిర్ణయాలపై విదేశీ వ్యాపారవేత్తలు వ్యాఖ్యలు చేయడాన్ని సమర్థించడం వేరని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. మస్క్‌కు మోదీపై రాజకీయ వ్యతిరేకత ఉండవచ్చని, అయితే ఆ కారణంతో భారత ప్రధానిపై విదేశీ పారిశ్రామికవేత్తలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని అంగీకరించకూడదని ఓవైసీ స్పష్టం చేశారు. ఈ అంశంలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలనే కిరెన్ రిజిజు ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఆవిష్కరణ

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి, గ్రామీణ పాలనలో పారదర్శకత, ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ పంచాయతీ మాసపత్రికను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ పత్రిక ద్వారా ప్రతి నెలా పంచాయతీరాజ్ శాఖలో జరిగే కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామీణాభివృద్ధి పనులు, ఉద్యోగుల సమస్యలు, విజయాలు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందించనున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నూతన ఆలోచనలు, సూచనలకు కూడా ప్రాధాన్యం కల్పించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండ్ తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఎడిటర్ అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ల్యాప్‌టాప్‌లు/టాబ్‌లు అందించాలని మంత్రి సీతక్కను కోరారు. వీటి ద్వారా డిజిటల్ సేవల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ నాగులూరి కృష్ణ కుమార్, అంబటి శ్రీనివాస్, టీజీఐఆర్‌డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, డిప్యూటీ సీఈవో వెంకన్న, డీఎల్పీవో సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువ ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

- షార్ట్ ఫిలిమ్స్‌తో సామాజిక చైతన్యం కల్పించాలి
- యువ ఫిల్మ్ మేకర్స్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 17 (ఆశ్వి అప్డేట్స్):

యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం శిల్పకళా వేదికలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. యువ దర్శకులు, సృజనాత్మక కళాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ అవార్డుల కార్యక్రమం గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి, స్థానిక యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రెండు నుంచి మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఒక కథను ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్నదని అన్నారు. అవార్డులు పొందని యువ కళాకారులు నిరుత్సాహపడకుండా తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో గొప్ప దర్శకులు, నిర్మాతలుగా ఎదగాలనుకునే యువతకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

సామాజిక సమస్యలపై చైతన్యం కల్పించాలి

సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షార్ట్ ఫిలిమ్స్‌ను సమర్థవంతమైన మాధ్యమంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ప్రజలను అప్రమత్తం చేసేలా సందేశాత్మక చిత్రాలు రూపొందించాలని సూచించారు. మనుషులు, పశువులు, పక్షులకు అవసరమైన నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రానున్న నెలల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. సృజనాత్మకతతో రూపొందించిన చిన్న చిత్రం సైతం సమాజంపై గొప్ప ప్రభావం చూపగలదని, యువ ఫిల్మ్ మేకర్స్ తమ ప్రతిభను సామాజిక ప్రయోజనాలకు ఉపయోగించాలని అన్నారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రంగుల మాదిరిగా యువత జీవితాలు కూడా విజయాలతో విరబూయాలని ఆకాంక్షిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు దయానంద్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, జ్యూరీ సభ్యులు వెన్నెల గద్దర్, విమలక్క, సినీ ప్రముఖులు, కళాకారులు, యువ ఫిల్మ్ మేకర్స్ తదితరులు పాల్గొన్నారు.





వామ్మో పిస్తా..

తింటే మంచిదే కానీ..
అతిగా తింటే సమస్య తప్పదు!

పిస్తా గింజలు రుచికరమైనవి మాత్రమే కాదు. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంటాయి. ఈ చిన్న ఆకుపచ్చ కాయలు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు, వివిధ విటమిన్లు అలాగే ఖనిజాలకు మంచి మూలం. పిస్తా గింజలు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కానీ., సంభావ్య ప్రతికూలతలను నివారించడానికి మితంగా తీసుకోవాలి. సమతుల్య ఆహారంలో భాగంగా పిస్తాలను చేర్చడం వలన అవసరమైన పోషకాలు అందుతాయి. మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. పిస్తా తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అలాగే సంభావ్య ప్రతికూలతలు గురించి చూద్దాం.



పిస్తా గింజల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు..

పోషకాలు సమృద్ధిగా:
పిస్తాపప్పులు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు, విటమిన్ బి6, థయామిన్, భాస్వరంల మంచి మూలం. వీటిలో ల్యూటిన్, జియాక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి.

గుండె ఆరోగ్యం:
పిస్తాపప్పులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. అలాగే గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వీటిలో మోనోశాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి.

బరువు నిర్వహణ:
కేలరీలు ఎక్కువగా ఉన్నప్పటికీ పిస్తాపప్పులు బరువు నిర్వహణలో సహాయపడతాయి. ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కలయిక మీకు సంతృప్తికరంగా ఉండటానికి సహాయపడుతుంది. మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గిస్తుంది.

రక్తంలో చక్కెర నియంత్రణ:
పిస్తాపప్పులు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచవు. ఇది డయాబెటిస్ ఉన్నవారికి మంచి చిరుతిండి ఎంపికగా చేస్తుంది.

కడుపు ఆరోగ్యం:
పిస్తాలో ఉండే ఫైబర్ కంటెంట్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల మలబద్ధకాన్ని నివారించవచ్చు. అవి ప్రీబయోటిక్స్ గా కూడా పనిచేస్తాయి. మీ పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను పోషిస్తాయి.

పిస్తా గింజల వల్ల కలిగే సంభావ్య ప్రతికూలతలు..

అధిక కేలరీలు:
పిస్తాపప్పులు పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, అవి కేలరీలు కూడా దట్టంగా ఉంటాయి. మితంగా తినకపోతే అధిక వినియోగం బరువు పెరగడానికి దారితీస్తుంది.

అలెర్జీలు:
కొందరికి పిస్తా అలెర్జీ కలిగిస్తుంది. దురద, దద్దుర్లు లేదా తీవ్రమైన సందర్భాల్లో అనాఫిలాక్సిస్ వంటి లక్షణాలను అనుభవించవచ్చు. పిస్తాలను తినేటప్పుడు ఏవైనా అలెర్జీ ప్రతిచర్యల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

పిస్తా ఫంగస్:
పిస్తాపప్పులు కొన్నిసార్లు అఫ్లాటాక్సిన్ అనే ఫంగస్ తో కలుషితమవుతాయి. ఇది పెద్ద పరిమాణంలో తీసుకుంటే మానవ ఆరోగ్యానికి హానికరం. ఈ ప్రమాదాన్ని నివారించడానికి ప్రసిద్ధ వనరుల నుండి పిస్తాలను కొనుగోలు చేయడం చాలా ముఖ్యం.

సోడియం కంటెంట్:
కాల్చిన పిస్తాలలో తరచుగా అదనపు ఉప్పు ఉంటుంది. ఇది అధికంగా తీసుకుంటే అధిక సోడియం తీసుకోవడానికి దోహదం చేస్తుంది. అధిక సోడియం తీసుకోవడం అధిక రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధులతో ముడిపడి ఉంటుంది.


సంభావ్య బరువు పెరుగుట:
పిస్తా బరువు నిర్వహణలో సహాయపడగలదు. అధిక కేలరీల కంటెంట్ కారణంగా అధిక వినియోగం బరువు పెరగడానికి దారితీస్తుంది. పిస్తాపప్పులు తినేటప్పుడు భాగ నియంత్రణ సాధన చేయడం చాలా ముఖ్యం.



పిల్లలు ఎక్కువ మొబైల్ చూస్తున్నారా..?
అయితే జాగ్రత్త సుమీ..

నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత మన రోజువారీ జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా, పిల్లలు స్మార్ట్ఫోన్లు, టాబ్లెట్లు ఇంకా ఇతర మొబైల్ పరికరాలు ఇట్టే లభించే డిజిటల్ యుగంలో పెరుగుతున్నారు. ఈ పరికరాలు విద్య, వినోదం పరంగా ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పిల్లలు వాటిని అధికంగా ఉపయోగించినప్పుడు పరిగణించవలసిన ఆరోగ్య ప్రభావాలు కూడా ఉన్నాయి. పిల్లలు ఎక్కువ మొబైల్ పరికరాలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రభావాలలో ఒకటి వారి శారీరక ఆరోగ్యంపై ప్రభావం. అధిక స్క్రీన్ సమయం కంటి ఒత్తిడి, మెడ నొప్పి, తలనొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. పిల్లలు తమ పరికరాలపై ఎక్కువసేపు సమయం గడపడం వల్ల అనేక సమస్యలను ఎదురుకోవలసి ఉంటుంది. ఇంకా, మొబైల్ పరికరాలను ఉపయోగించడం నిశ్చల స్వభావం శారీరక శ్రమ లేకపోవటానికి దోహదం చేస్తుంది. ఇది మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడుకోవడానికి అవసరం. ఇది దీర్ఘకాలంలో ఊబకాయం, గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుంది.శారీరక ఆరోగ్య ప్రభావాలతో పాటు, అధిక స్క్రీన్ సమయం పిల్లల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఎక్కువ చూడడం వల్ల ఆందోళన, నిరాశ, పేలవమైన నిద్ర నాణ్యత వంటి సమస్యల మధ్య సంబంధాన్ని అధ్యయనాలు చూపించాయి. తెరలకు నిరంతరం గురికావడం పిల్లల సిర్కాడియన్ లయలకు అంతరాయం కలిగిస్తుంది. ఇది తగినంత విశ్రాంతి పొందే వారి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది.





దోసకాయ తింటే
ఇన్ని మార్పులా..?

గత కొన్ని సంవత్సరాలనుండి దోసకాయలు సలాడ్లు, శాండ్విచ్ల కోసం బాగా ప్రజాదరణ పొందాయి. కానీ వీటిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని మీకు తెలుసా..? దోసకాయలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించగల బహుముఖ, పోషకమైన కూరగాయ. బరువు తగ్గడానికి సహాయపడటం నుండి జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడటం, ప్రకాశవంతమైన చర్మాన్ని ప్రోత్సహించడం వరకు మీ సాధారణ ఆహారంలో దోసకాయలు చేర్చడానికి అనేక కారణాలు ఉన్నాయి. దోసకాయలు క్రమం తప్పకుండా తినడం వల్ల బరువు తగ్గడంలో వాటి పాత్రతో సహా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచగల వివిధ మార్గాలను ఒకసారి చూద్దాం.



హైడ్రేషన్, అవసరమైన పోషకాలు :
దోసకాయలు 95శాతం నీటితో కూడి ఉంటాయి. ఇవి ముఖ్యంగా వేసవి రోజుల్లో హైడ్రేటెడ్ గా ఉండటానికి అద్భుతమైన ఎంపిక. దోసకాయలు వాటి అధిక నీటి కంటెంట్ తో పాటు, విటమిన్ కె, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం వంటి అవసరమైన పోషకాలకు కూడా మంచి మూలం. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యం, శక్తిని కాపాడుకోవడానికి ముఖ్యమైనవి.

జీర్ణ ఆరోగ్యం:
దోసకాయలు ముఖ్య ఆరోగ్య ప్రయోజనాల్లో ఒకటి జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడే వాటి సామర్థ్యం. దోసకాయలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుంది. దోసకాయల్లో అధిక నీటి శాతం కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఉబ్బరం, అజీర్ణాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

బరువు తగ్గడం:
కొన్ని అదనపు కేజల శరీర బరువు తగ్గించాలని కోరుకునే వారికి దోసకాయలు మీ ఆహారంలో విలువైన అదనంగా ఉంటాయి. దోసకాయల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి చాలా కేలరీలు తీసుకోకుండా కడుపు నింపడానికి గొప్ప ఎంపికగా ఉంటాయి. అదనంగా, దోసకాయలలోని ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని పూర్తిగా, సంతృప్తిగా ఉంచడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా అతిగా తినే అవకాశాన్ని తగ్గిస్తుంది.

యాంటీఆక్సిడెంట్ గుణాలు:
దోసకాయలు బీటాకెరోటిన్, ఫ్లేవనాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షించడానికి, శరీరంలోని వాపును తగ్గించడానికి సహాయపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

చర్మ ఆరోగ్యం:
దోసకాయలు వాటి అంతర్గత ఆరోగ్య ప్రయోజనాలతో పాటు, మీ చర్మానికి కూడా అద్భుతాలు చేయగలవు. దోసకాయలు వాటి ఉపశమనం, హైడ్రేటింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ఒక ప్రసిద్ధ పదార్థంగా మారాయి. దోసకాయలు క్రమం తప్పకుండా తినడం వల్ల మీ చర్మం యొక్క మొత్తం రూపాన్ని మెరుగుపరచడానికి, వాపును తగ్గించడానికి, ఆరోగ్యకరమైన ప్రకాశాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది.

‘గరివిడి లక్ష్మి’కి పవన్ టీమ్ శుభాకాంక్షలు..

ఆనంది టైటిల్ పాత్రలో గౌరీ నాయుడు జమ్ము తెరకెక్కించిన చిత్రం ‘గరివిడి లక్ష్మి’ (Garividi Lakshmi). 80, 90ల దశకంలో తెలుగు ప్రజల్ని తన పాటలు.. బుర్రకథలతో ఉర్రూత లూగించిన కళాకారిణి రెడ్డి విజయ లక్ష్మి అలియాస్ గరివిడి లక్ష్మి జీవిత కథగా రూపొందిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ సినిమాపై పవన్ కల్యాణ్ టీమ్ ప్రశంసలు కురిపించింది.


“గరివిడి లక్ష్మి’ టీమ్‌కు అభినందనలు. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఉత్తరాంధ్ర గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఈ సినిమా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో అద్భుతంగా నటించిన నటి ఆనందికి ప్రత్యేక అభినందనలు. అలాగే ఈ స్ఫూర్తిదాయకమైన కథను తెరపైకి తీసుకురావడానికి అంకితభావంతో శ్రమించిన నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు చిత్రబృందానికి శుభాకాంక్షలు” అని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పోస్ట్ పెట్టింది.



ఆ హీరోతో పిచ్చిగా ప్రేమలో ఉన్నా

బాలీవుడ్ సినిమాలు, అందులోని రొమాంటిక్ హీరోల ప్రభావం తనపై ఎంతగా ఉందో నటి మృణాల్ ఠాకూర్ (Mrunal Thakur) తాజాగా పంచుకున్నారు. ముఖ్యంగా తెరపై కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ (Shah Rukh Khan) పోషించిన రొమాంటిక్ పాత్రలు ప్రేమ పట్ల తన అంచనాలను పెంచేశాయని ఆమె తెలిపారు. తన జీవితంలో షారుక్ ఖాన్ లేకపోవడం ఎలానో ఉందంటూ సరదాగా వ్యాఖ్యానించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మృణాల్.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

“నా జీవితంలో షారుక్ ఖాన్ లేడనే విషయం మనసును ముక్కలు చేస్తోంది. రొమాన్స్ విషయంలో ఆయన క్రియేట్ చేసిన బెంచ్‌మార్క్ గురించి ఎంత చెప్పినా తక్కువే. నాకు షారుక్ సర్ అంటే పిచ్చి ప్రేమ. స్క్రీన్‌పై ఆయన చేసిన పాత్రలంటే చాలా ఇష్టం. షారుక్‌లా రొమాంటిక్‌గా ఉండే వ్యక్తిని నేను ఇప్పటిదాకా కలవలేదు” అని ఆమె చెప్పుకొచ్చారు. గతంలో సినిమాల్లో చూపించిన రొమాన్స్‌కు, ప్రస్తుత కాలానికి ఉన్న తేడాల గురించి కూడా మృణాల్ మాట్లాడారు. “నేను పాత బికానిక్ సినిమాలను మళ్లీ చూసినప్పుడు.. కొన్ని విషయాలు చూసి ‘ఏంటిది.. ఎందుకు ఇలా తీశారు’ అనిపిస్తుంది. అయితే, ఆ కాలం వేరు. అప్పట్లో సోషల్ మీడియా లేదు, కేవలం వినోదం కోసమే సినిమాలు చూసేవారు. కానీ, ఇప్పుడు అంతా మారింది. ఏ విషయంలోనైనా మహిళలకు కొన్ని ఎంపికలు చేసుకునే అవకాశాలున్నాయి. ఇలాంటి కాలంలో పుట్టినందుకు సంతోషంగా ఉంది. ఒక సినిమా నుంచి కొందరు గుణపాఠం నేర్చుకుంటారు. మరికొందరు కేవలం వినోదంగా మాత్రమే చూస్తారు. మూవీ చూసిన తర్వాత కూడా కొందరిలో మార్పు రాదు. ఇదంతా ప్రేక్షకులు సినిమాను అర్థం చేసుకునే కోణంపై ఆధారపడి ఉంటుంది” అని ఆమె అభిప్రాయపడ్డారు.



ఇంటి సరిహద్దులు దాటి అంతరిక్షం వైపు..



మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలెంటెడ్ డైరెక్టర్ పవన్ సాదినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ ‘ఆకాశంలో ఒక తార’. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం విశేషం. లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి.ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ ప్రారంభించిన మూవీ మేకర్స్.. తాజాగా ‘ఆకాశంలో ఒక తార’ టీజర్‌ను విడుదల చేశారు.

"కల తనది.. నమ్మకం కృష్ణది.. కానీ ప్రయాణం వారిద్దరిది" అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో పదిలిన ఈ టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. టీజర్ విషయానికి వస్తే.. చదువంటే ఎంతో ఇష్టమున్న కల్పన అనే అమ్మాయి జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి ఊరికి మంచి పేరు తెచ్చిందనే వాయిస్ ఓవర్‌తో ప్రారంభమవుతుంది. ‘అమ్ములు నువ్వు కష్టపడి చదువుతానంటే..నేను చదివిస్తా"అని చెప్పే హృదయానికి హత్తుకునే డైలాగ్‌తో దుల్కర్ సల్మాన్ కృష్ణ పాత్రలో ఎంట్రీ ఆకట్టుకుంటుంది. పల్లెటూరి అమ్మాయిగా సాత్విక వీరవల్లి తన నటనతో మెప్పించింది. తల్లిదండ్రులు ఇంటికే పరిమితం చేయాలని చూసినా, భర్త కృష్ణ ఆమెను చదివించి అంతరిక్షం వరకు వెళ్లేలా ప్రోత్సహిస్తాడు. ఇక ఈ క్రమంలోనే శృతి హాసన్ సిగరెట్ తాగుతూ ఊరమాస్ అవతార్‌లో ఇచ్చిన ఎంట్రీ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది.

మహిళలను గౌరవించడం అనేది ఈ తొమ్మిది రోజులకే పరిమితం కాకూడదు



లివిజన్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నీతి టేలర్, పలు చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. పలు కారణాల వల్ల సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ భామ బుల్లితెరపై ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తుంది. పలు సంచలన విషయాలతో నిత్యం వార్తల్లో నిలుస్తూ అందరి దృష్టిని పొందుతోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నీతి టేలర్ నవరాత్రి పండుగతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రంగురంగుల దుస్తులు, గాజులు ధరించి ఇష్టసఖులతో గడపడం, రోజంతా డ్యాన్సులతో హోరెత్తించడం తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టమని తెలిపారు. వృత్తిపరమైన పనుల వల్ల ఇప్పుడు అన్ని రోజులు వేదుకల్లో పాల్గొనలేకపోయినా, పండుగ వచ్చిందంటే తనలోని చిన్నారి మనసు ఉరకలేస్తుందని చెప్పారు. ఫ్యాషన్ పరంగా ట్రెడిషనల్ చనియా చోళీ, మిర్రర్ వర్క్ దుస్తులు ధరించడం తనకిష్టమని, వయసుతో సంబంధం లేకుండా అందరూ కలిసి ఆనందించే గర్బా వేడుకలు ఎంతో ప్రత్యేకమని నితి టేలర్ పేర్కొన్నారు. అలాగే పండుగ వేళ మహిళల భద్రతపై నీతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ‘‘స్త్రీ శక్తినీ, పవర్‌ని పూజించే నవ్రాత్రి పండుగ సమయంలో కూడా మహిళల సేఫ్టీ గురించి మాట్లాడుకోవాల్సి రావడం నిజంగా విచారకరం. ప్రతి మహిళ తనకు నచ్చిన బట్టలు వేసుకుని, రాత్రివేళల్లో భయం లేకుండా తిరిగి సురక్షితంగా ఇంటికి చేరాలి. అది ఆమె హక్కు. స్త్రీలను గౌరవించడం కేవలం ఈ తొమ్మిది రోజుల పూజలకే పరిమితం కాకూడదు, ప్రతిరోజూ పాటించాలి" అని తెలిపారు.

రొమాంటిక్ థ్రిల్లర్ షురూ?

‘పెద్ది’ చిత్రంతో ఈ మధ్యే తెరపై మెరిసి కుర్రకారుని ఆకట్టుకున్నారు బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్. ప్రస్తుతం అగ్రతారల సరసన అవకాశాల్ని అందుకుంటూ జోరుమీదున్న ఈ తార.. దర్శకుడు ఉమేశ్ బిష్ట్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. జాన్వీ, శ్రీలీల, సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడీ సినిమా గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈ చిత్ర షూటింగ్‌ను మొదలెట్టినట్లు సమాచారం. “చిత్రబృందం మొదటి షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. ఇందులో జాన్వీ, శ్రీలీల, సిద్ధార్థ్ భాగమయ్యారు. రొమాంటిక్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం శ్రీలీల, జాన్వీ కలిసి నటించడం చిత్రానికే ప్రధాన ఆకర్షణగా నిలవనుంద”ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఒకే వ్యక్తిని ఇష్టపడే ఇద్దరు మహిళల చుట్టూ తిరిగే లవ్‌స్టోరీగా ఈ సినిమా కథ ఉంటుందని, త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.



‘రియాలిటీ’ ఆలోచన



కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం ‘రియాలిటీ’. దేవికాభట్ కథానాయిక. సుధాకర్ చాగంటి నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ సినిమాలోని కథానాయిక దేవికాభట్ పాత్రని పరిచయం చేస్తూ లుక్‌ని విడుదల చేశారు. ఆలోచన అనే పాత్రలో కనిపించనున్నారట దేవికాభట్. పేరుతోనే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఆ పాత్ర తెరపై చేయనున్న సందడి ఎలాంటిదో తెలియాలంటే క్రిస్మస్ వరకూ ఆగాల్సిందే. శరత్‌కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విశ్వాస్ డేనియల్, ప్రొడక్షన్ డిజైన్: సుధీర్ మాచర్ల.

నా ప్రతిష్టకు భంగం కలిగించే ఆ కంటెంట్‌ను తొలగించండి..

ఇటీవలి కాలంలో సినీ నటీమణుల రూపాన్ని ఏఐ ద్వారా దుర్వినియోగం చేయడం తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఇప్పటికే చాలామంది రియాక్ట్ కాగా.. తాజాగా, తన ప్రతిష్టను కాపాడుకునేందుకు నేహా శర్మ రంగంలోకి దిగి లీగల్ వార్నింగ్ ఇవ్వడం నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. కొందరు వ్యక్తులు తన ప్రమేయం లేకుండానే తన ముఖాన్ని, రూపాన్ని ఉపయోగిస్తూ ఏఐ ద్వారా నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టిస్తున్నారంటూ ట్విట్టర్ వేదికగా సంచలన పోస్ట్ పెట్టారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ మార్ఫింగ్, ఫేక్ కంటెంట్‌పై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన అనుమతి లేకుండా తన ఫేస్ లేదా రూపాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న వారు వెంటనే ఆ పనిని ఆపేయాలని హెచ్చరించారు.

ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అటువంటి ఫేక్ వీడియోలు, చిత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తన గుర్తింపును ఇలా దుర్వినియోగం చేస్తూ తనను తప్పుగా చిత్రీకరించడం, ప్రతిష్టకు భంగం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దీనిని ఒక అధికారిక హెచ్చరికగా పరిగణించాలని ఆమె తేల్చి చెప్పారు. అంతేకాకుండా, నకిలీ ఖాతాల వెనుక దాక్కున్నా లేదా ఏఐ టెక్నాలజీని ఉపయోగించినా బాధ్యులు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేహా శర్మ హెచ్చరించారు. ఈ విధమైన కంటెంట్‌ను తయారు చేసినా, పోస్ట్ చేసినా లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేసినా సరే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధ్యులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S